www.samasamajam.in

# సమ సమాజం


ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శుక్రవారం, 12 ఆగస్టు 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్వీరాజు | సంపుటి - 07, సంచిక-123 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్‌కర్ ప్రమాణం



- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము
- హాజరైన ప్రధాని మోడీ,కేంద్రమంత్రులు, విపక్ష నేతలు
- భైరాన్‌సింగ్ షెకావత్ తరవాత రెండో వ్యక్తిగా ధన్‌కర్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11 (సమ సమాజం):** భారత 14వ ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్కర్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీతో పాటు మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ దంపతులు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, సుబ్రహ్మణ్యం జైశంకర్ విపక్ష నేతలు, ఎంపీలు హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిగా బరిలో దిగిన జగదీప్ ధన్కర్ ప్రతిపక్షాల అభ్యర్థి మార్గరెట్ అల్వాపై విజయం సాధించారు. 1951 మే 18న రాజస్థాన్‌లోని కితానా అనే మారుమూల గ్రామానికి చెందిన సాధారణ రైతు కుటుంబంలో జగదీప్ జన్మించారు. చిత్తోడ్ ఘఢ్ సైనిక్ స్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించిన ఆయన.. జైపూర్ రాజస్థాన్ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. జనతాదళ్ తరపు నుంచి 9వ లోక్‌సభ

2వ

# తెలంగాణ ఉప్పుడు బియ్యానికి కేంద్రం ఓకే

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11 (సమ సమాజం):** తెలంగాణలో ఉప్పుడు బియ్యం సేకరణకు కేంద్రం ఆమోదం తెలిపింది. 2021-22 రబీ సీజన్‌లో పండించిన 8లక్షల మెట్రిక్ టన్నుల ఉప్పుడు బియ్యం సేకరణకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు కేంద్ర మంత్రిత్వ శాఖ లేఖ రాసింది. గతంలో ఇచ్చిన 6.05లక్షల మెట్రిక్ టన్నులకు అధనంగా బియ్యం సేకరించాలని నిర్ణయించినట్లు కేంద్రం లేఖలో పేర్కొంది. ఇందుకు అనుగుణంగా ఎఫ్‌సీఐ చర్యలు తీసుకుంటుందని వెల్లడించింది. ఉప్పుడు బియ్యం విషయంలో కేంద్ర నిర్ణయంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తో పాటు కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ మంత్రి పియూష్ గోయల్‌కు ధన్యవాదాలు తెలుపుతూ కిషన్‌రెడ్డి ప్రకటనను విడుదల చేశారు.

# మునుగోడుపై కెసిఆర్ ప్రత్యేక దృష్టి

- నల్లగొండ నేతలతో ప్రత్యేకంగా భేటీ
- మునుగోడు పరిస్థితులపై ఆరా
- గెలుపే లక్ష్యంగా నేతలకు దిశానిర్దేశం




**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారి పోతున్నాయి. మునుగోడు ఉప ఎన్నికలో గెలిచి సత్తా చాటాలని అధికార పార్టీ టీఆర్ఎస్ పట్టుదలగా ఉంది. ఈ మేరకు సిఎం కెసిఆర్ కూడా వ్యూహాలు పన్ను తున్నారు. తాజాగా టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో ప్రగతిభవన్ లో సమావేశమయ్యారు. మునుగోడు ఉప ఎన్నికపై జిల్లా మంత్రి జగదీష్ రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ తో సీఎం కేసీఆర్ చర్చించారు. ఉప ఎన్నికలో అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్ తోపాటు ఇతర పార్టీలు కూడా భావిస్తున్నాయి. ఇందులో భాగంగానే అన్ని పార్టీలు ఇప్పుడు మునుగోడు నియోజకవర్గంపై ప్రత్యేకంగా ఫోకస్ చేశాయి. ఈ క్రమంలో గ్రౌండ్ లెవల్ లో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయనే దానిపై సీఎం కేసీఆర్ పార్టీ నేతలతో ఆరా తీశారు. ఉప ఎన్నికలో టీఆర్ఎస్ తరపున ఎవరిని బరిలో దింపితే గెలుస్తారు..? ఎవరికి విజయావకాశాలు ఉన్నాయి..? అనే వివరాలపైనా ఆరా తీశారు. టిక్కెట్ ఎవరికి ఇచ్చినా అందరూ కలిసి కష్టపడి పని చేయాలని, తప్పనిసరిగా మునుగోడు ఉప ఎన్నికలో గులాబీ జెండా ఎగురవేయాలని నాయకులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. మరోవైపు కేబినెట్

2వ

# కొత్తగా పదిలక్షల మందికి పెన్షన్లు

- 21 తలపెట్టిన ప్రత్యేక అసెంబ్లీ భేటీ రద్దు
- 75మంది ఖైదీల విడుదలకు నిర్ణయం
- కోఠి ఇఎన్‌టిలో ప్రత్యేక టవర్ నిర్మాణం
- మరో పదిమంది ప్రత్యేక డాక్టర్ పోస్టుల మంజూరు
- ఖాళీగా ఉన్న 5111 అంగన్ వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీ
- తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు



**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** తెలంగాణలో 15 ఆగస్టు నుంచి రాష్ట్రంలో కొత్తగా 10 లక్షల పెన్షన్లు మంజూరు చేస్తూ క్యాబినెట్ నిర్ణయించింది. స్వాతంత్య్ర వజ్రోత్సవాల్లో భాగంగా ఈనెల 21న తలపెట్టిన శాసనసభ, స్థానిక సంస్థల ప్రత్యేక సమావేశాలు రద్దు చేశారు. స్వాతంత్య్ర వజ్రోత్సవాల్లో భాగంగా ఈనెల 16న ఉదయం 11.30 నిమిషాలకు రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక జాతీయ గీతాలాపన జరపాలని నిర్ణయం

3వ

# అమ్మ ఒడి ఎక్కడా లేని పథకం



- ప్రభుత్వ ఆస్పత్రులు బలోపేతం
- సహజ ప్రసవాలను ప్రతోహించేలా చర్యలు
- ఇప్పటివరకు 13.30 లక్షల మందికి కేసీఆర్ కిట్లు
- రాఖీ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కెటిఆర్

**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** ఏ రాష్ట్రంలో లేనివిధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. అమ్మ ఒడి లాంటి పథకం ఎక్కడా లేదని చెప్పారు. రాఖీపౌర్ణమి సందర్భంగా వివిధ పథకాల లబ్దిదారులతో మంత్రి కేటీఆర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇస్తున్నామని వెల్లడించారు. చట్ట సభల్లో కూడా మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రాన్ని కోరామన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు

2వ

# టిఆర్ఎస్, బిజెపిల మధ్య రహస్య ఒప్పందం

- రాజ్‌గోపాల్ కోసం టిఆర్ఎస్ మద్దతు
- రాజీనామా చేసిన వెంటనే ఆమోదించిన స్పీకర్
- అర్జంట్‌గా రాజీనామా ఆమోదించడంలో ఆంతర్యం ఇదే
- 13న మునుగోడులో పాదయాత్ర చేపట్టినట్లు రేవంత్ వెల్లడి



**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** రాష్ట్రంలో మునుగోడు బైపోల్ హీట్ మొదలైంది. ఉప ఎన్నిక గెలుపు కోసం అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 13న మునుగోడులో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పాదయాత్ర చేయనున్నారు. ఆజాదీ కా అమృత్ గౌరవ్ యాత్రలో భాగంగా రేవంత్ పాదయాత్ర చేయనున్నారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని టీపీసీసీ చీఫ్

2వ

# నేడు తెలంగాణ ఎంసెట్ ఫలితాలు విడుదల

ఉదయం11 గంటలకు విడుదల చేయనున్న మంత్రి సబిత



**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** తెలంగాణ ఎంసెట్ ఫలితాలు ఈనెల 12న శుక్రవారం విడుదల కానున్నాయి. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఈ ఫలితాలను ఉదయం 11 గంటలకు జెఎన్‌టీయూలో విడుదల చేస్తారు. గత నెల 18 నుంచి 20 వరకు ఇంజినీరింగ్, 30, 31వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ఎంసెట్ పరీక్ష జరిగింది. ఇంజినీరింగ్ ఎగ్జామ్ కు 1,56,812 మంది హాజరయ్యారు. 80 వేల 575 మంది అగ్రికల్చర్, ఫార్మా కోర్సుల కోసం పరీక్ష రాశారు. ఇప్పటికే ప్రాథమిక సమాధానాలు విడుదల చేసి విద్యార్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. తుది సమాధానాలతో పాటు ఫలితాలను ఎంసెట్ కమిటీ విశ్లేషించింది. ఫలితాలను వెబ్ సైట్ లో అందుబాటులో ఉండనున్నాయి. వాస్తవానికి ఎంసెట్ పరీక్ష జూలై 14, 15వ తేదీల్లో నిర్వహించాల్సి ఉండే. భారీ వర్షాల కారణంగా జూలై 18, 19, 20వ తేదీల్లో రెండు విడతలుగా పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. ఫలితాలు విడుదలైన అనంతరం మొదటి విడత కౌన్సెలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం ఆన్ లైన్ లో ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. సర్టిఫికేట్ల వేరిఫికేషన్ అనంతరం వెబ్ ఆప్షన్లు ఇస్తారు. అనంతరం సీట్ల కేటాయింపు ఉండనుంది.

## సంపాదకీయం

### పాలకులు ఆత్మావలోకనం చేసుకోవాలి !

దేశం స్వాతంత్ర్యం సాధించుకుని గర్వంగా 75 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో ఆజాదీకా అమృత్ మహోత్సవాలను ఊరూవాడా సంబరంగా జరుపుకుంటున్నారు. ప్రజలు త్రివర్ణ పతాకం చేతబూని తమ దేశభక్తిని చాటుతున్నారు. కష్టాలు,నష్టాలు భరించి, ఆకలి బాధలను మరచి దేశం పట్ల తమకున్న భక్తిని చాటు తున్నారు. ఇదే సమయంలో పాలకులు తమ విధానాల్లో,ఆలోచనల్లో మార్పులతో ముందుకు సాగాలి. పటిష్ట భారత నిర్మాణానికి కంకణబద్దులు కావాలి. సరిహద్దుల్లో ఉగ్రమూకలను గట్టిగా అణచివేస్తూ ముందుకు సాగాలి. ఈ 75 ఏళ్ల వైఫల్యాలపై పాలకులు ఆత్మపరిశీలన చేసుకునే సమయమిదే. రాజకీయాలను పక్కన పెట్టి సానుకూలంగా ఆలోచన చేసి ముందుకు సాగాల్సిన సమయమిది. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ది కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ 70 ఏళ్ల తరవాత కూడా ఇంకా దారిద్య్రం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నోట్ల రద్దు తరవాత అనేక కష్టాలు పడుతున్నారు. మోడీరాకతో ప్రజల్లో చిగురించిన ఆశలు వమ్మయ్యాయి. అందుకే మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాలి. విద్యా,వైద్యరంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసుకోవాలి. ఆహార ధాన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. వివిధ రంగాలపై అది చూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం ప్రజల కోణంలో ఆలోచించాలి. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఉల్లిపాయలు,కూరగాయల ధరలు దిగిరావడం లేదు. నిత్యవసరాలు అందనంతగా దూసుకుపోతున్నాయి. వంటనూనెలు భగ్గుమంటున్నాయి. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపం లోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం తాజా ఎన్నికల్లో సైతం చూస్తున్నాం. ఈ డబ్బుకు లెక్క ఉందో లేదో చెప్పాలి. ఇలా రాజకీయ పార్టీలకు అధికార యావే తప్ప ప్రజలు,దేశ సంక్షేమం కనబడడం లేదు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారు స్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఎన్నికల్లో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకురాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక, ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని ఈ 75 ఏళ్లలో నిరూపితం అయ్యింది. ఆ క్రమంలోనే ఖర్చు వందలు, వేల కోట్ల రూపాయలకు చేరిపోయింది. దేశంలో ఇప్పటికీ సరైన ప్రజారోగ్య వ్యవస్థ లేదు. వ్యవసాయరంగం కుంగి కృషించిపోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆహార ధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగి స్తున్న పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో తగిన శ్రద్ద చూపడం లేదు. ఈదశలో ఇలాంటి ప్రజాస్వామ్యం కొనసాగితే మరో వందేళ్లయినా మన భారత్ రాత మారదు. రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. అప్పుడే ప్రజలకు స్వాతంత్ర్య ఫలం దక్కుతుంది. అప్పుడే భారత్ ఉజ్వలంగా వెలుగుతుంది. అందుకు పూనుకోకుంటే ప్రజల్లో ఉన్న అసంతృప్తి రాజకీయ పార్టీలను దహించివేయ కతప్పదు. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం మానుకోవాలి. సంస్థల ను బలోపేతం చేస్తూ..నిరుద్యోగ సమస్యలను పరిష్కరించగలగాలి. ఉచతి పథకాల పేరుతో వేలకోట్ల వృధాను అడ్డుకోవాలి. ఉచిత పథకాలపై దేశవ్యాప్త చర్చసాగాలి. అలాగే ఉచితాలతో మనార్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులను కట్టడి చేయాలి. విద్వేషాగ్నులు పెచ్చరిల్లేలా విదేశీ గడ్డపై నుంచి వస్తున్న సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో ప్రజలు, ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వానికి అండగా నిలవాలి. విపక్షాలు ఇక కాశ్మీర్‌పై విమర్శలు కట్టిపెట్టాలి. కలసికట్టుగా ముందుకు సాగాలి. ఈ స్వాతంత్ర్య దినోత్సవా నికి ప్రత్యేకత ఉంది. ఇప్పుడు ప్రజలు స్వేఛ్ఛా స్వాంత్ర్యాలను పీల్చుకుని సగర్వంగా కలసి ముందుకు సాగనున్నారు. ఇకపోతే దేశం విభజన నాటినుంచి పాక్ కుతంత్రాలకు కేంద్రంగా ఉంటూ అక్కడి ప్రజలను ఎదగనీయకుండా సైన్యం పడగనీడలో కొనసాగుతోంది. విడిపోయిన వారు శత్రువులుగా మారారు. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన అవపరం ఉంది. జెండా ఎగుర వేయడమే గాకుండా ప్రజల కోసం పరితపించేలా పాలన సాగిస్తామని ప్రతిన చేయాల్సిన సమయమిది. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

## అమ్మ ఒడి ఎక్కడా లేని పథకం

(మొదటి పేజి తరువాయి) తెలిపారు. ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేశామని వెల్లడించారు. ఇప్పటివరకు 13.30 లక్షల మందికి కేసీఆర్ కిట్లు అందజేశామన్నారు. మగపిల్లలు పుడితే రూ.12 వేలు, ఆడ పిల్లలు పుడితే రూ.13 వేలు ఇస్తున్నామని తెలిపారు. అనవసర సిజేరియన్లు తగ్గించి సహజ ప్రసవాలు పెంచాలని సంకల్పించామన్నారు. సహజ ప్రసవం చేయించే వైద్య సిబ్బందికి రూ.3 వేల ప్రోత్సాహకం ఇస్తున్నామని చెప్పారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కావద్దని కల్యాణలక్ష్మి తీసుకొచ్చామని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 లక్షల మంది తల్లులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తున్నదని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తల జీతాల్లో కేంద్రం కోటా తగ్గించిందని, అయినప్పటికీ అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల జీతాలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందన్నారు. కంటి వెలుగు ద్వారా బాధితులకు వైద్యం అందించామని వెల్లడించారు. ఏజెన్సీ ఏరియాల్లోని ప్రజల ఆరోగ్య పరిస్థితి కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు చేయించామని, దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు. రాష్ట్ర ప్రజలందరి హెల్త్ ప్రొ÷ల్ సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచామన్నారు. 33 జిల్లాల్లో 33 వైద్య కళాశాలల ద్వారా పేదలకు వైద్యం అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ వల్ల మంచినీళ్ల సమస్య పూర్తిగా తీరిందని చెప్పారు. ఫ్లోరోసిస్ మహమ్మారిని తరికొట్టామన్నారు. ఇప్పుడు హర్ ఘర్ జల్ పేరుతో కేంద్రం ఏదో ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. సీఎం కేసీఆర్ హయాంలో పెన్షన్ పదిరెట్లు పెరిగిందని చెప్పారు. నాలుగు లక్షల మంది మహిళా బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. 14 లక్ష మంది ఒంటరి, వితంతు మహిళలకు పెన్షన్ ఇస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుంచి మరో 10 లక్షల మంది కొత్తవాళ్లకు పెన్షన్లు ఇవ్వనున్నామని తెలిపారు.

## మునుగోడుపై కెసిఆర్ ప్రత్యేక దృష్టి

(మొదటి పేజి తరువాయి) భేటీకి ముందు మునుగోడు ఉప ఎన్నికపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఈనెల 21న మునుగోడులో బీజేపీ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసింది. దీనికి అమిత్ షా హాజరుకానున్నారు. అయితే.. బీజేపీ సభ కంటే ముందే సభ ఏర్పాటు చేయాలని టీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. ఈనెల 19వ తేదీన సభ పెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. భారీ బహిరంగ సభ ఏర్పాట్ల కోసమే పార్టీ ప్రజాప్రతినిధులతో సీఎం కేసీఆర్ ప్రగతిభవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారని తెలుస్తోంది. ఇంతకుముందే ఉమ్మడి నల్గొండ ప్రజాప్రతినిధులతో సీఎం కేసీఆర్ భేటీ కావాల్సి ఉంది. అయితే.. టీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి మునుగోడు టిక్కెట్టు ఇవ్వొద్దని ఆయనకు వ్యతిరేకంగా ఉన్న నేతలు డిమాండ్ చేశారు. దీంతో అసమ్మతి నేతలను హైదరాబాద్ కు పిలిపించి నిన్న దాదాపు 3గంటలపాటు జిల్లా మంత్రి జగదీశ్ రెడ్డి చర్చించారు. ఆ తర్వాత వారిని ప్రగతిభవన్ కు తీసుకెళ్లారు. కానీ, సీఎం కేసీఆర్ తర్వాత కలుద్దామని చెప్పడంతో తిరిగి వెళ్లిపోయారు. మునుగోడులో టీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ అభ్యర్థి 50 వేల మెజార్టీతో గెలవబోతున్నారని మంత్రి జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. మొత్తంగా మునుగోడు ఉప ఎన్నికలో హుజురాబాద్ తరహా ఫలితమే పునరావృతమైతే రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో టీఆర్ఎస్ పై ప్రతికూల ప్రభావం పడే చాన్స్ ఉందనే ఆందోళనలో టీఆర్ఎస్ ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే హడావుడి చేయకుండా సైలంట్ గా ప్రచారం చేసేలా ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు మునుగోడు నియోజకవర్గంపై టిఆర్ఎస్ ప్రత్యేకంగా ఫోకస్ చేసింది.

రేవంత్ రెడ్డి అన్నారు. ఒప్పందం లేకుండానే రాజగోపాల్ రెడ్డి

## టిఆర్ఎస్, బిజెపిల మధ్య రహస్య ఒప్పందం

(మొదటి పేజి తరువాయి) రాజీనామాను 5నిమిషాల్లోనే ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో మీడియాతో చిట్ చాట్ చేసిన రేవంత్.. ఎన్నికలకు అంత అర్జెంట్ ఏముందని ప్రశ్నించారు. హుజురాబాద్ ఎన్నిక టిఆర్ఎస్‌కు .. మునుగోడు ఎన్నిక బీజేపీకి అవసరమని.. ఒకరి అవసరాలు ఒకరు తీర్చుకుంటున్నారని రేవంత్ ఆరోపించారు. టీఆర్ఎస్, బీజేపీ పార్టీలు రెండూ ఒక్కటే అని రేవంత్ రెడ్డి అన్నారు. ఒప్పందం లేకుండానే రాజగోపాల్ రెడ్డి రాజీనామాను ఐదు నిమిషాల వ్యవధిలోనే ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. ఎన్నికలకు అంత అర్జెంట్ ఏముందని అన్నారు. హుజురాబాద్ ఎన్నిక టీఆర్ఎస్‌కు అవసరమని... మునుగోడు ఎన్నిక బీజేపీకి అవసరమని అన్నారు. ఒకరి అవసరాలు ఒకరు తీర్చుకుంటుంన్నారని రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మరోవైపు మునుగోడు బైపోల్ పై కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. గాంధీభవన్ లో ఎన్నికల ప్రణాళిక కమిటీ సమావేశం అయ్యింది.మునుగోడు ఉపఎన్నికపై చర్చించనున్నారు.ఇప్పటికే టికెట్ ఆశావహులతో గాంధీభవన్ లో బోసురాజు సమావేశం నిర్వహించారు. పాల్వాయి స్రవంతి, చల్లమల్ల కృష్ణారెడ్డి, పల్లె రవికుమార్, కైలాష్ నేతతో మాట్లాడారు. మరోవైపు హైదర్ గౌడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో చెరుకు సుధాకర్ తో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్కం ఠాగూర్ సమావేశం అయ్యారు. అయితే తాను టికెట్ ఆశించడం లేదని చెరుకు సుధాకర్ అన్నారు. కాంగ్రెస్ లో టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపు కోసం పనిచేస్తానన్నారు. మాణిక్కం ఠాగూర్ తో మర్యాదపూర్వకంగానే భేటీ అయినట్లు చెప్పారు.

## ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న బాలిక

**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధి టకార బస్తీలో విషాదం చోటు చేసుకుంది. ఐదో తరగతి బాలిక ఇంట్లో ప్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వారం రోజులుగా స్కూల్‌కి వెళ్లనంటూ సమీక్ష మారాం చేస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. న్యూ బోయిగుడలోని కీర్తి హైస్కూల్‌లో సమీక్ష ఐదో తరగతి చదువుతోంది. విషయం తెలిసిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హర్‌ఘర్ తిరంగా ప్రారంభించిన కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** హర్‌ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గురువారం ఉదయం నగరంలోని ఎర్రగడ్డ రైతు బజార్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. జాతీయ జెండాలతో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ , పలువురు బీజేపీ నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్సార్ నగర్, పంజాగుట్ట, కేర్ హాస్పిటల్, సచివాలయం, లిబర్టీ, హిమాయత్ నగర్, శంకర్ మట్, అడిక్‌మెట్, మాణికేశ్వర్ నగర్, ఇఫ్లూ, చిలకలగూడ మీదుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద ర్యాలీ ముగియనుంది.

## రజాకార్లను ఎదరించిన వీరుడు బత్తిని మొగిలయ్యగౌడ్

**పాదయాత్రలో నివాళి అర్పించిన బండి సంజయ్**

**దమ్ముంటే వారితో రాజీనామా చేయించు**

**కెసిఆర్‌కు బండి సంజయ్ సవాల్**

**యాదాద్రి భువనగిరి, ఆగస్ట్ 11 (సమ సమాజం):** నిజాం రజాకార్లను ఎదిరించి జాతీయ జెండా కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు బత్తిని మొగిలయ్య గౌడ్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం సిరిపురంలో 9వ రోజు పాదయాత్ర ప్రారంభించిన బండి సంజయ్.. బత్తిని మొగులయ్యకు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ రోజుల్లోనే జాతీయ జెండా కోసం ప్రాణా త్యాగం చేసిన వ్యక్తి అని కొనియాడారు. జాతీయ జెండా గొప్పతనం గురించి చెప్పిన మొగిలయ్య జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి అని..ప్రతి ఆదివారం జాతీయ జెండా ఎగరేసి తన దేశభక్తిని చాటారని తెలిపారు. 300 మంది రజాకార్లను ఉరికించిన వ్యక్తి బత్తిని మొగిలయ్య గౌడ్ అని బండి సంజయ్ అన్నారు. మొగిలయ్య గౌడ్ వీరోచిత పోరాటం సమాజానికి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇటువంటి వీరుల చరిత్రను పాఠ్యంశాలలో చేర్చాల్సిన అవసరం ఉందన్న ఆయన..బీజేపీ అధికారంలోకి వస్తే ఆయన జీవితచరిత్రను పాఠ్యాంశంగా మారుస్తామన్నారు.




## స్వాతంత్ర్య స్ఫూర్తి చాటేలా వజ్రోత్సవ వేడుకలు

**ఎల్బీనగర్‌లో ఫ్రీడమ్ రన్‌ను ప్రారంభించిన మంత్రి సబిత**



**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** ప్రతి ఒక్కరిలో స్వాతంత్ర్య స్ఫూర్తి చాటేలా రాష్ట్రంలో స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బానిస సంకెళ్లు తెంచుకొని యావత్ భారతావని స్వేచ్ఛా వాయువులు పిలుస్తూ 75 వసంతాలు పూర్తిచేసుకున్న శుభ సమయంలో.. రాష్ట్రంలో 15 రోజులపాటు సంబురాలు, దేశ భక్తి పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రోజు వారీగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉవ్వెత్తున కొనసాగుతున్నాయని వెల్లడించారు. వజ్రోత్సవ ద్విసప్తాహంలో భాగంగా హైదరాబాద్ ఎల్బీనగర్‌లో నిర్వహించిన ఫ్రీడమ్ రన్‌ను మంత్రి సబితా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు పేదల చెంతకు చేరినప్పుడే స్వాతంత్ర్య ఫలాలు అందినట్లు సీఎం కేసీఆర్ భావిస్తారని వెల్లడించారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ రాష్ట్ర ప్రజల చిరునవ్వుకు కారణమవుతున్నారన్నారు. పల్లెలు,పట్టణాల్లో ఫ్రీడమ్ రన్ విజవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరిలో స్వాతంత్య స్ఫూర్తి చాటేలా, జాతీయ దృక్పథంతో ఎందరో అమరులు చేసిన త్యాగాలు స్మరిస్తూ వజ్రోత్సవాల వేళ పరుగు పెడుతున్నట్లు తెలిపారు. ÷-వాతంత్య పోరాటంలో మహాత్మ గాంధీజీ చేసిన పోరును రానున్న తరాలు గుర్తుపెట్టుకునేలా గాంధీజీ చిత్రాన్ని విద్యార్థులకు ఉచితంగా చూపిస్తున్నామన్నారు. ప్రజలందరికి ముందస్తుగా స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సరూర్ నగర్ స్టేడియం నుంచి ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వరకు నిర్వహించిన ఫ్రీడమ్ రన్‌లో పెద్దసంఖ్యలో యువత పాల్గొన్నారు. భారీ జాతీయ పతాకంతో రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీలు దయానంద్, ఎ÷-గగె మల్లేశం, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, రాచకొండ సీపీ మహేశ్ భగవత్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ పాల్గొన్నారు.

## ఉపరాష్ట్రపతిగా జగ్‌దీప్ ధన్‌కర్ ప్రమాణం



(మొదటి పేజి తరువాయి) ఎన్నికల్లో ఝుంఝును స్థానం నుంచిజగదీప్ ధన్‌కర్ ఎంపీగా విజయం సాధించారు. 1993లో కిషన్ ఘడ్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2003లో ఆయన బీజేపీలో చేరారు. 2019లో కేంద్రం జగదీప్ ను బెంగాల్ గవర్నర్ గా నియమించింది. జగదీప్ ధన్‌కర్ రాజస్థాన్ హైకోర్టు బార్ అసోషియేషన్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహించారు. ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో మెంబర్‌గా వ్యవహరించారు. కొన్నాళ్ల పాటు సుప్రీం కోర్టులోనూ పని చేశారు. రాజస్థాన్నుంచి ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనవారిలో జగదీప్ ధన్‌కర్ రెండోవారు. 2002 నుంచి 2007 వరకు ఆ రాష్ట్రానికి చెందిన భైరాన్ సింగ్ షెకావత్ ఈ పదవిని నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పని చేసిన ధన్‌కర్ ఎన్డీయే అభ్యర్థిగా ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రతిపక్షాల అభ్యర్థిగా మార్గరెట్ అల్వా పోటీ చేశారు. చెల్లుబాటైన 710 ఓట్లలో 528 ఓట్లు ధన్‌కర్‌కు లభించాయి. మార్గరెట్ అల్వాకు 182 ఓట్లు లభించాయి. జగదీప్ ధన్‌కర్ అంతకుముందు ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతి పదవీ కాలం బుధవారంతో ముగిసింది. ఉపరాష్ట్రపతి రాజ్యసభ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తారు. ఈసారి లోక్‌సభ సభాపతి ఓంబిర్లా, రాజ్యసభ చైర్మన్ పదవులను నిర్వహిస్తున్న ఇద్దరూ రాజస్థాన్‌కు చెందినవారే కావడం విశేషం.

## కొనసాగుతున్న బండి పాదయాత్ర

**9వరోజు రామన్నపేటలో బండియాత్ర**


**మునుగోడులో బిజెపిదే విజయమన్న బండి**



**యాదాద్రి, ఆగస్ట్ 11 (సమ సమాజం):** యాదాద్రి జిల్లాలో బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్ర కొనసాగుతోంది. విఆర్‌వోలకు ఆయన మద్దతు ప్రకటించారు. అలాగే ఎక్కడిక్కడ ప్రజల సమస్యలపై చర్చిస్తూ యాత్రను కొనసాగించారు. బండి సంజయ్ పాదయాత్ర 9వ రోజు గురువారం రామన్నపేటకు చేరుకుంది. ఈ క్రమంలో మునుగోడులో బిజెపి గెలిచి తీరుతుందని బండి అన్నారు. టిఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.ఇటీవలే కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. హస్తానికి గుడ్ బై చెప్పి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఆయన గెలుపు అనివార్యమని అన్నారు. ఇదే సందర్భంగా సీఎం కేసీఆర్‌కు బండి సంజయ్ సవాల్ విసిరారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో కేసీఆర్ రాజీనామా చేయించాలి. నైతిక విలువలుంటే ఉప ఎన్నికలో కొట్లాడుదాం రండి. లీటర్ పెట్రోల్‌పై రూ.30 దోచుకుంటూ ధరల పెంపుపై మాట్లాడటం సిగ్గుచేటు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీళ్ల కోసం రూ. లక్షకోట్లకు పైగా ఖర్చు చేశారు. యాద్రాద్రి ప్రాంత ప్రాజెక్ట్ కోసం రూ.700 కోట్లు ఖర్చుపెట్టలేరా? అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ మాటలన్నీ గాలి మాటలే. ప్రజలు సీఎం మాటలు నమ్మే పరిస్థితి లేదు. కేంద్రం నిధులు ఇవ్వడం లేదనేది అవాస్తవం. నకిరేకల్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు ఇచ్చామో లెక్కలు చెప్పాం. తప్పయితే, దమ్ముంటే కేసులు పెట్టుకోండి. మునుగోడులో బీజేపీ గెలుపు ఖాయం. పార్టీ ఫిరాయించిన పన్నెండు మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని డిమాండ్ చేశారు.

## నేను ఉపరాష్ట్రపతి కావాలని కోరుకోలేదు

**సుశీల్ కుమార్ మోడీ వ్యాఖ్యలను తిప్పికొట్టిన నితీశ్**



**పాట్నా, ఆగస్ట్ 11 (సమ సమాజం):** బీజేపీ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీ వ్యాఖ్యలను బిహార్ సీఎం నితీశ్ కుమార్ ఖండించారు. ఆయనను ఉపరాష్ట్రపతిని చేయనందునే బీజేపీతో బంధాన్ని తెంచుకున్నారన్న వ్యాఖ్యలపై నితీశ్ స్పందించారు. సుశీల్ వ్యాఖ్యలు చాలా హాస్యాస్పదంగా ఉన్నాయని.. అసలు తాను ఉపరాష్ట్రపతి పదవి కావాలని అనుకులేదని నితీశ్ కుమార్ స్పష్టం చేశారు. దీన్నే ఆయన అది ఒక జోక్... అంతా బోగస్ అని అభివర్ణించారు. తమకు అలాంటి ఉద్దేశం లేదు కాబట్టే... రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తాము ఎన్డీయేకు మద్దతిచ్చాం.. ఆ విషయం మర్చిపోయారా అంటూ ఆయన ప్రశ్నించారు. ఉప రాష్ట్రపతి పదవికి నామినేట్ చేయాలని జేడీయూ పార్టీకి చెందిన కొందరు నేతలు ఇటీవల తమను కోరారాని బీజేపీ నేత సుశీల్ కుమార్ మోడీ కామెంట్స్ చేశారు. అలా నితీశ్‌ను ఉపరాష్ట్రపతిగా నామినేట్ చేస్తే... ఆయన ఢిల్లీకి వెళ్లిపోతారని... అప్పుడు రాష్ట్రంలో మీరు ముఖ్యమంత్రి కావచ్చంటూ జేడీయూ లీడర్లు తమ దగ్గరికి వచ్చారని ఇటీవలే సుశీల్ కుమార్ మోడీ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన మాటలు చాలా జోక్ గా అనిపిస్తున్నాయని.. అవన్నీ బోగస్ మాటలు అంటూ నితీశ్ తాజాగా సమాధానమిచ్చారు.

# బ్రిటిష్ తొత్తులు రాజ్యామేలుతున్నారు

బిజెపిపై పరోక్ష విమర్శలు చేసిన మంత్రి నిరంజన్



**వనపర్తి, ఆగస్ట్ 11 (సమ సమాజం):** స్వాతంత్ర్యం అంటే ఒక్క రోజు చేసుకునే వేడుక కాదని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. భారత స్వాతంత్య సంగ్రామంలో ఎలాంటి పాత్రలేని వారు, బ్రిటిష్ పాలకులకు తొత్తులుగా వ్యవహరించిన వారు నేడు ఈ దేశానికి ప్రభువులుగా ఉన్నారని విమర్శించారు. స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా వనపర్తిలో నిర్వహించిన ఫ్రీడమ్ రన్‌లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్యం÷-ర కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేశారు, భగత్ సింగ్ ఉరికంబానికి సిద్ధమయ్యారు.. ఇలా దేశంలో ఒక్కోచోట ఒక్కోవిధంగా ప్రజలను స్వాతంత్య సంగ్రామం వైపు కదిలించారని చెప్పారు. ఎవరు ఏ దారిని ఎంచుకున్నప్పటికీ అందరి లక్ష్యం భారతమాత సంకెళ్లను తెంచడంకోసమేనని వెల్లడించారు. ఆ రోజు మన పెద్దలు స్వాతంత్యం÷-ర కోసం పోరాడకపోయి ఉంటే మన పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలోని బృందం భారత రాజ్యాంగాన్ని రచించారని, దానిప్రకారమే దేశంలో పాలన, న్యాయ, శాసన వ్యవస్థలతో పాటు అన్ని వ్యవస్థలు నడుస్తున్నాయని చెప్పారు. ఏది చేసినా రాజ్యాంగానికి విఘాతం కలగకుండా ముందుకుసాగాలని సూచించారు. స్వాతంత్యంర విలువ, దానికోసం చేసిన త్యాగాలు ఈ తరానికి, భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ మొక్కుబడిగా కాకుండా 15 రోజులపాటు విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తు న్నారని చెప్పారు. ఈ నెల 8 నుంచి 22 వరకు వజ్రోత్సవ వేడుకలను జరుపుతున్నామని వెల్లడించారు.

# సాగర్‌కు పెరిగిన వరద ప్రవాహం

26 గేట్లు ఎత్తేసిన అధికారులు



**నల్లగొండ, ఆగస్ట్ 11 (సమ సమాజం):** శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు భారీ వరద కొనసాగుతున్నది. వరద పెరగడంతో మరిన్ని గేట్లను ఎత్తారు. దీంతో అధికారులునాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి ఇన్ ఫ్లో : 4,38,446 క్యూసెక్కులు..ఔట్ ఫ్లో : 3,36,672 క్యూసెక్కులుగా ఉంది.ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం : 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటి మట్టం : 588.00 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ: 312 టీఎంసీలకు గాను ప్రస్తుతం : 306.1010 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అయితే 2009 తర్వాత మళ్లీ 2022 లో 26 గేట్లు ఎత్తి నీటిని దిగువ వదిలినట్లు అధికారులు తెలిపారు.

## వాటర్ ట్యాంక్ పైకెక్కి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగి నిరసన



**రెగోడ్, ఆగస్టు 11 (సమ సమాజం):** వాటర్ ట్యాంక్ పైకెక్కి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగి సుజాత హల్చల్ చేసిన ఘటన రేగోడ్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం రేగోడు మండలం మర్పల్లి గ్రామానికి చెందిన మహిళ ఉద్యోగిని సుజాత ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తుంది. ప్రభుత్వం తిరిగి వారిని విధుల్లోకి తీసుకుంటున్నట్లుగా బుధవారం సాయంత్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తన ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగ ఉత్తర్వులను ఇతరులకు ఇవ్వడంతో మనస్తాపానికి గురైన ఉద్యోగిని సుజాత అధికారుల వైఖరిని నిరసిస్తూ వాటర్ ట్యాంక్ పైకెక్కి నిరసన ఆందోళనకి దిగింది. తన ఉద్యోగం తనకు కావాలంటూ డిమాండ్ చేసింది. లేదంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ మొండికేసింది. విషయం తెలుసుకున్న రేగోడు పోలీసులు అక్కడికి చేరుకొని సుజాతను కిందికి రావాలంటూ కోరారు. నా ఉద్యోగం స్థానంలో నా పేరు కాకుండా లిస్టులో వేరే వారి పేరు రావడం ఏంటని దీనికి అధికారులు స్పందించి నా ఉద్యోగం నాకు ఇచ్చేంతవరకు క్రింద కు రాను అని సమాధానమిచ్చింది. సాయంత్రం నుండి రెండు గంటలకు పైగా వాటర్ ట్యాంక్ పైకెక్కి ఆందోళన చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ మహిళ ఉద్యోగిని సుజాత ఆందోళన నిరసన విషయం తెలుసుకున్న మండల సంబంధిత అధికారులు అవేవి పట్టించుకోకుండా కార్యాలయం నుండి మెల్లగా జారుకున్నారు. ఈ విషయం పట్ల అధికారుల నిర్లక్ష్య ధోరణి పట్ల మర్పల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన ధర్నాకు దిగారు. అల్లాదుర్గ్ సి ఐ జార్జ్ మహిళా ఉద్యోగితో ఫోన్లో మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని కావున వాటర్ ట్యాంక్ పై నుండి కిందికి రావాలని కోరాగా అధికారులు వచ్చేంతవరకు రానంటూ ఆమె మొండికేసింది. స్పందించాల్సిన మండలాధికారులు జారుకున్నారు. జిల్లా అధికారులైన స్పందించి ఆమె ఉద్యోగం ఆమెకు తిరిగి ఇప్పించి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ధర్నాకు దిగారు.

# కొత్తగా పదిలక్షల మందికి పెన్షన్లు

(మొదటి పేజి తరువాయి)తీసుకున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 36 లక్షల పెన్షన్ల అందజేస్తోంది.తాజాగా అదనంగా 10 లక్షల మందికి కొత్త పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. కొత్తవి,. పాతవి కలిపి మొత్తం 46 లక్షల మందికి పెన్షన్ ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు తెలంగాణ కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఐదు గంటల పాటు సాగిన ఈ భేటీలో పలు అంశాలపై చర్చించారు. ఇక స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాల సందర్భంగా 75 మంది ఖైదీల విడుదలకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. కోఠి ఈఎన్.టి. ఆస్పత్రికి 10 మంది స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. అలాగే కోఠి ఈఎన్‌టి ఆస్పత్రిలో అధునాతన సౌకర్యాలతో టవర్ నిర్మించాలని నిర్ణయించారు. సరోజినీ దేవి కంటి దావాఖానలో కూడా అధునాతన సౌకర్యాలతో కూడిన నూతన భవన సముదాయాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశారు. అలాగే ÷ూష్ట్రంలో ఖాళీగా ఉన్న 5111 అంగన్ వాడీ టీచర్లు, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కేబినెట్ ఆమోదించిది. జీవో 58, 59 కింద పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని చీఫ్ సెక్రటరీకి కేబినెట్ ఆదేశం ఇచ్చింది. గ్రామకంఠంలో నూతన ఇళ్ల నిర్మాణానికి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులతో ఒక కమిటీ వేసి, 15 రోజుల్లోగా ఒక నివేదిక ఇచ్చి, సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నిర్ణయించారు. వికారాబాద్‌లో ఆటోనగర్ నిర్మాణానికి 15 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయించింది. తాండూరు మార్కెట్ కమిటీకి యాలాలలో 30 ఎకరాల ఎకరాల స్థలం కేటాయించారు. షాబాద్‌లో బండల పాలిషింగ్ యూనిట్ల ఏర్పాటుకు టీఎస్ ఐఐసీ ఆధ్వర్యంలో 45 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. స్వతంత్ర భారత వజ్రోత్సవాల్లో భాగంగా ఈనెల 21వ తేదీన తలపెట్టిన శాసనసభ, స్థానిక సంస్థల ప్రత్యేక సమావేశాలు రద్దు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 21వ తేదీన పెళ్లిళ్లు, శుభకార్యాలకు చివరి ముహూర్తం కావడం వల్ల పెద్దఎత్తున వివాహాది శుభకార్యక్రమాలు ఉన్నందున ప్రజా ప్రతినిధుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రత్యేక సమావేశాలను రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

# మన మునుగోడు.. మన కాంగ్రెస్

ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ కొత్త నినాదం ✧ ఆమోదయోగ అభ్యర్థిని బరిలోకి దింపే ప్లాన్



**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికల్లో గెలిచేందుకు అన్ని పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. సిట్టింగ్ సీటును దక్కించుకునేందుకు కాంగ్రెస్ గ్రౌండ్ లెవల్ నుంచి వ్యూహరచన చేస్తోంది. మన మునుగోడు మన కాంగ్రెస్ నినాదాన్ని ఎత్తుకుని ముందుకెళ్తుంది.గల్లీ లీడర్ నుంచి ఢిల్లీ లీడర్ వరకు మునుగోడుకెళ్లాలని హస్తం పార్టీ నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 13 నుంచి 30 వరకు నేతలు మునుగోడులో పర్యటించేలా ప్రణాళికలు రచిస్తున్నారు. గ్యాస్ సిలిండర్, పెట్రోల్ ధరల పెంపుపైనే ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధానంగా బీజేపీ, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డినే టార్గెట్‌గా చేస్తూ ప్రచారం చేయాలని నిర్ణయించారు. కులాలు, వృత్తుల వారీగా అనుబంధ సంఘాలకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. అమిత్ షా సభకు పోటీగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో బహిరంగ సభకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతానికి మునుగోడులో అభ్యర్థి ఎంపికను పక్కకు పెట్టిన టీపీసీసీ... ఇప్పటి కిప్పుడే అభ్యర్థిని ÷నైల్ చేస్తే మరింత నష్టం అని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఆశావహులను కూడా మునుగోడులో ప్రచారం చేయాలని ఏఐసీసీ, పీసీసీ నేతలు సూచించారు. ఈ క్రమంలో ఎదురుదాడికి కూడ ప్లాన్ చేస్తోంది. భాజపా-తెరాస కుట్రలో భాగంగానే ముందస్తు ఎన్నికల ప్రతిపాదనను పక్కనబెట్టి... మునుగోడు ఉపఎన్నిక తెచ్చారని కాంగ్రెస్ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీ ఆరోపించారు. రాష్ట్రంలో తెరాస,భాజపా మధ్యే పోటీ ఉందనే వాతావరణం తెచ్చేందుకు రెండు పార్టీలు ఒప్పందంతో సాగుతున్నా యనన్నారు. వారి కుట్రలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందన్నారు. మునుగోడు ఉపఎన్నికను కాంగ్రెస్ పార్టీ సెమీఫైనల్‌గా భావిస్తుందన్న ఆయన... ఈ పరిణామాలను అధినేత్రి సోనియాగాంధీ సైతం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. కార్యకర్తలందరికీ ఆమోదయోగ్యమైన వారిని మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థిగా ఉంటారని మధుయాష్కీతో చెప్పారు. తెరాస, భాజపా కుట్రతోనే మునుగోడు ఎన్నిక తెచ్చారు. ముందస్తు ఎన్నికలు పక్కనబెట్టి మునుగోడు ఎన్నిక తెచ్చారు. తెరాస-భాజపా మధ్యే పోటీ అనే వాతావరణం తెచ్చే వ్యూహాలు పన్నుతున్నారు. కాంగ్రెస్ లేదనే వాతావరణం సృష్టించేందుకు భాజప, తెరాస యత్నాలు చేస్తున్నారు. భాజపా, తెరాస కుట్రలను తిప్పికొట్టేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. కేసీఆర్ రాజకీయ చరిత్ర అంతా ఎన్నికలతోనే ఉంటుంది. ఎన్నికల్లో గెలవకపోతే గెలిచిన వారిని పార్టీలోకి తెచ్చుకుంటారు. గతంలో మాదిరిగా పోటీచేస్తే కాంగ్రెస్ గెలిచే పరిస్థితిలేదు. అందుకే మేము ఇక ప్రతి ఎన్నికనూ సెమీఫైనల్‌గానే భావిస్తాం. రాజ్‌గోపాల్‌రెడ్డి పార్టీని వీడినా.... కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉన్నారు. రాజ్‌గోపాల్‌రెడ్డి కంటే వెంకట్‌రెడ్డి సీనియర్ నాయకుడు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాడర్ సైతం కాంగ్రెస్‌లోనే ఉంటుంది. రాజ్‌గోపాల్‌రెడ్డి ఎత్తులు వేస్తే మేము పైఎత్తులు వేస్తాం. వెంకట్‌రెడ్డిపై చండూరు సభలో వ్యాఖ్యలు బాధాకరం అన్నారు.

## పతాక కీర్తిని నలుదిక్కుల చాటాలి: అల్లాదుర్గం సీఐ జార్జ్



**అల్లాదుర్గం, ఆగస్టు 11 (సమ సమాజం):** స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాల్లో భాగంగా భారతదేశ త్రివర్ణ పతాక కీర్తిని నలుదిక్కుల చాటాలని అల్లాదుర్గం సీఐ అన్నారు. గురువారం మండల కేంద్రమైన అల్లాదుర్గంలో స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని స్థానిక బస్టాండ్ లోని గాంధీ విగ్రహం నుండి 161 జాతీయ రహదారి వరకు ఫ్రీడమ్ 2కె రన్ లో సీఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ సిఐ జార్జ్, అల్లాదుర్గం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అంజి యాదవ్ లు మాట్లాడుతూ. ప్రజలందరిలో దేశభక్తి భావనను పెంపొందించేందుకు స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాలను పురస్కరించుకొని 15 రోజులపాటు ద్వి స్వప్త వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. స్వాతంత్ర్యపోరాట స్ఫూర్తిని ప్రజలందరిలో మేలుకొలిపేలా పాఠశాల విద్యార్థులు మొదలుకొని ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, యువతి, యువకులు, యువజన సంఘాలు స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల్లో భాగస్వాములను చేశామని వారు తెలిపారు. నేటితరం యువతకు స్వాతంత్ర్య ఉద్యమం చరిత్రను చాటి చెప్పేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కోరు బోయిన దశరథ్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, అల్లాదుర్గం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు ధనుంజయ గౌడ్, అల్లాదుర్గం ఏ ఎస్ ఐ దేవిదాస్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులుకాల రాములు వివిధ పాఠశాలలప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఘనంగా ఆజాది కా అమృత్ మహోత్సవం




**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 11 (సమ సమాజం):** రంగా రెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ తుర్కయంజాల్ మున్సిపాలిటీలో ఘనంగా ఆజాది కా అమృత్ మహోత్సవం కార్యక్రమం గురువారం రోజు జరిగింది. ఈ కార్యక్రమంలో తుర్కయంజాన్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కౌన్సిలర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య, కొత్త కురుమ మంగమ్మ శివకుమార్, శ్రీనివాస్ నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మేతరి దర్శన్, మున్సిపాలిటీ అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రతి ఒక్కరూ భారతదేశానికి గౌరవించాలని, ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను ఎగురవేయాలని, ప్రతి ఒక్కరూ తమ తమ పిల్ల మీద జాతీయ జెండాలు ఎగురవేయాలని, ప్రస్తా యువతకు దేశం భక్తి మీద అవగాహన కల్పించుట కొరకై, సినిమా థియేటర్లలో గాంధీ సినిమాను ఉచితంగా ప్రదర్శించడం జరుగుతుంది కావున ప్రతి ఒక్కరు ఆ సినిమాను చూడాలని ఆయన అన్నారు

# శశిథరూర్‌కు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం

లేఖ ద్వారా తెలియచేసిన ఫ్రాన్స్ రాయబార కార్యాలయం

తనకు అవార్డు ప్రకటనపై అభినందనలు తెలిపిన శశి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11 (సమ సమాజం):** కాంగ్రెస్ నేత,ఎంపి శశిథరూర్‌కు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారాన్ని ప్రకటించింది. విశిష్టమైన పౌర లేదా సైనిక ప్రతిభను చూపినవారికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. 1802లో నెపోలియన్ బోనపార్టీ ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. రచనలు, ప్రసంగాల్లో ప్రతిభకు గుర్తింపుగా దీనిని శశి థరూర్‌కు ఇస్తున్నారు. షెవలియర్ డీ లా లెజియన్ డీహానర్ ఫ్రాన్స్‌లో అత్యున్నత పౌర పురస్కారం. రచనలు, ప్రసంగాల్లో అద్భుత ప్రతిభను ప్రదర్శించే శశి థరూర్‌కు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. న్యూఢిల్లీలోని ఫ్రెంచ్ రాయబారి ఓ లేఖ ద్వారా ఆయనకు ఈ సమాచారాన్ని తెలిపారు. ఫ్రెంచ్ ప్రభుత్వ మంత్రి ఎవరైనా భారత దేశ పర్యటనకు వచ్చినపుడు ఈ పురస్కారాన్ని థరూర్‌కు ప్రదానం చేస్తారు. ట్విటర్ వేదికగా వెల్లువెత్తిన అభినందనలపై శశి థరూర్ ఓ ట్వీట్‌లో స్పందించారు. 'ఫ్రాన్స్‌తో మన సంబంధాల పట్ల సంతోషించేవారిలో, ఫ్రెంచ్ భాషను ప్రేమించేవారిలో, ఆ సంస్కృతిని ఇష్టపడేవారిలో ఒక వ్యక్తిగా నన్ను ఈ విధంగా గుర్తించడం గౌరవప్రదంగా భావిస్తున్నాను. ఈ విశిష్టతను ప్రదానం చేయడానికి నేను తగిన వ్యక్తినని భావించినవారందరికీ నా కృతజ్ఞతలు, వారిపట్ల నా గౌరవ భావాన్ని ప్రకటిస్తున్నాను' అని తెలిపారు. శశిథరూర్ 2010లో స్పానిష్ ప్రభుత్వం నుంచి ఇటువంటి పురస్కారాన్ని పొందారు. ఆయనను గౌరవిస్తూ ఎంకోమిండా డీ లా రియల్ ఆర్డర్ ఎస్పానోలా డీ కార్లోస్ 3ని స్పెయిన్ రాజు ప్రకటించారు.÷ెరళలోని తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి శశి థరూర్ రెండుసార్లు విజయం సాధించారు. విదేశీ వ్యవహారాలపై పార్లమెంటు స్థాయీ సంఘం ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. యూపీఏ ప్రభుత్వంలో ఆయన మానవ వనరుల అభివృద్ధి, విదేశీ వ్యవహారాల శాఖల సహాయ మంత్రిగా పని చేశారు. ఆయన అత్యంత అరుదైన ఆంగ్ల పదాలను తన ట్వీట్లలో ఉపయోగిస్తూ ఉంటారు. థరూర్ గత ఏడాదిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఫ్రెంచ్ భాషలో ప్రసంగించి ఎంబసీ, కాన్సులేట్లు, అలయెన్స్ ఫ్రాంకాయిస్, మిలిటరీ అటాచెస్ అధికారులను ఆశ్చర్యపరిచారు.

# రాఖీ కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి

ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం కెసిఆర్



**హైదరాబాద్, ఆగస్ట్ 11 (సమ సమాజం):** అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల ప్రేమకి అద్దం పట్టేది రాఖీ పండుగ. ఈ పండుగను దేశ వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. పలువురు ప్రముఖులు, రాజకీయ నేతలు, పలువురు ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నారు. అందులో భాగంగా... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మానవ సంబంధాల్లోని పవిత్రమైన సహోదరభావాన్ని మన బలోపేతం చేసేది రక్షా బంధన్ అన్నారు. అన్నా, తమ్ముళ్లు.. తమ అక్కా చె÷-లలెళ్లకు ఎల్లవేళలా అండగా నిలబడుతారనే భరోసాతో పాటు భావన ఈ పండుగలో ఇమిడి ఉందన్నారు. సోదర భావంతో ప్రేమానురాగాలతో ప్రతి సంవత్సరం శ్రావణ మాసం పౌర్ణమి నాడు, రాఖీలు కట్టుకొంటారన్నారు. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల్లో ఆనాది నుంచి కొనసాగుతున్న గొప్ప ఆచారమని తెలిపారు. రక్షాబంధన్ వేడుకల సందర్భంగా దేశ ప్రజల నడుమ సహోదర భావం మరింతగా పరిఢవిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు... కరోనా కారణంగా రెండేండ్లుగా రాఖీ పండుగరకు బ్రేక్ పడింది. ఈసారి కరోనా తీవ్రత లేకపోవడంతో పండుగను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. రాఖీలు కొనుగోలు చేసేందుకు ప్రజలు మార్కెట్లకు వెళుతున్నారు. దీంతో మార్కెట్లన్నీ సందడిగా మారాయి. సాదాసీదా రాఖీలతో పాటు క్రియేటివ్‌గా, కస్టమైజ్డ్‌గా ఉన్న రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. ఆఫ్‌లైన్ మార్కెట్లు, ఆన్ లైన్ లో డిఫరెంట్ వెరైటీల్లో రాఖీలు, రిటర్న్‌గిఫ్ట్‌లు లభిస్తున్నాయి. లాకెట్లపై బ్రదర్, భాయ్ వంటి అక్షరాలను రాసి తయారుచేస్తున్నారు. హ్యాండ్ మేడ్ ఫొటో ప్రింటెడ్ రాఖీలు, సీడ్ రాఖీలు ట్రెండీగా వస్తున్నాయి. హైదరాబాద్‌లోని రాఖీ దుకాణాలు మహిళలతో సందడిగా మారాయి. రాఖీలు కొనేందుకు వచ్చిన మహిళలతో బేగంబజార్ దుకాణాలు కళకళలాడుతున్నాయి. అన్నా చెల్లి, అక్క తమ్ముళ్ల మధ్య బంధాన్ని పెంచే ఈ పండుగను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. తోబుట్టువుల మధ్య అన్యోన్యతను.. అనురాగాలను ద్విగుణీకృతం చేస్తుంది. రాఖీ పండుగ వచ్చిందంటే చాలు.. ఆడవాళ్లు తమ అన్నలు, తమ్ముళ్ల చేతీలకు రాఖీలు కట్టేయడంలో మునిగిపోతారు. ప్రతీ సోదరుడు తన అక్కా చెల్లెళ్లకు తోచిన మేరకు కానుకలు సమర్పించి.. వారి ముఖాల్లో చిరునవ్వు చిందింపచేస్తాడు. ఎల్లవేళల తోడుంటానని అభయమిస్తాడు. రెండేళ్లుగా కరోనా కారణంగా పండుగను జరుపుకునే అవకాశం లేకపోవడంతో.. ఈసారి ఘనంగా జరుపుకునేందుకు మహిళలు రాఖీలు కొనుగోలు చేస్తున్నారు.

## సిబ్బంది కూతుళ్లతో రాఖీ కట్టించుకున్న మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11 (సమ సమాజం):** ప్రధాని మోడీ తన కార్యాలయంలో పనిచేస్తే సిబ్బంది కుమార్తెలతో రాఖీలు కట్టించుకుని కొత్త ఒరవడి సృష్టించారు. పీఎంఓలో పని చేసే ఫోర్త్ క్లాస్ సిబ్బంది కూమార్తెలతో మోడీ రాఖీ కట్టించుకున్నారు. ఆ చిన్నారుల్లో స్వీపర్లు, ప్యూన్లు, తోటమాలి, డ్రైవర్ల కుమార్తెలు ఉన్నారు. ప్రధాని వారందరికీ స్వీట్లు ఇచ్చి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులను ప్రేమేమగా పలకరించి వారిని అక్కున చేర్చుకున్నారు.

# ఓయూ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

ఆందోళనతో దిగివిచ్చిన అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 11 (సమ సమాజం):** ఓయూ విద్యార్థుల ఆందోళనతో అధికారులు దిగి వచ్చారు. సెమిష్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ నెల 22 నుండి ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ప్రారంభం కావాల్సిన పీజీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. పరీక్షలు వాయిదా వేయాలంటూ నిన్న అర్ధరాత్రి వరకు ఓయూలో విద్యార్థులు చేసిన ఆందోళనపై స్పందించిన యూనిర్సిటీ సానుకూల నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొద్దిసేపటి క్రితం ప్రకటన విడుదల చేసింది. ఆర్‌ఆర్ బీ, కానిస్టేబుల్ పరీక్షల సమయంలో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళన చేశారు. ఎంతో కాలంగా ఉద్యోగ అవకాశాలు లేక కష్టపడ్డామని.. తీరా ఇప్పుడు అవకాశాలు ముంగిటకు వచ్చాక సెమిస్టర్ పరీక్షలు పెడితే ఎలా అని విద్యార్థులు ప్రశ్నించారు. తమ ఉద్యోగ అవకాశాలను కాలరాసే విధంగా సెమిస్టర్ పరీక్షలను నిర్వహించవద్దని డిమాండ్ చేస్తూ నిన్న అర్ధరాత్రి వరకు ఆందోళన చేశారు. విద్యార్థుల ఆందోళనలను పరిగణలోకి తీసుకున్న ఓయూ అధికారులు సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. తిరిగి పరీక్షలు ఎప్పుడు నిర్వహించేది తేదీల వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు.







## పొలిటికల్ డ్రామాగా మాచర్ల నియోజకవర్గం

**నేడు విడుదలవుతున్న నితిన్ సినిమా**

నితిన్ మొదటి నుంచి కూడా లవ్ ..యాక్షన్ ..ఎమోషన్ కలిసిన కథలను ఎంచుకుంటూ వస్తున్నాడు. ఈసారి ఆయన పొలిటికల్ డ్రామాతో కూడిన మాస్ యాక్షన్ కథను నమ్ముకున్నాడు. 'మాచర్ల నియోజకవర్గం' సినిమాలో ఆయన కలెక్టర్ గా కనిపించనున్నాడు. ఈ పాత్రను పోషించడం నితిన్ కెరియర్లో ఇదే ఫస్టు టైమ్. నితిన్ సొంత బ్యానర్లో నిర్మితమైన ఈ సినిమా ఈ నెల 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎడిటర్ గా మంచి అనుభవమున్న రాజశేఖర్ రెడ్డి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు.ఇటీవల కాలంలో ప్రతి సినిమాకి ముందు ఆ టీమ్‌ని బిత్తిరి త్తి చేసే ఇంటర్వ్యూ బాగా కలిసొస్తోంది. అలా ఈ సినిమా టీమ్ ను బిత్తిరిసత్తి ఇంటర్వ్యూ చేశాడు. 'పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లో రాజశేఖర్ రెడ్డి నాకు ఒక కథను చెప్పాడు. వినగానే నాకు కొత్తగా అనిపించింది. ఈ సినిమాలో నా పాత్ర చాలా పవర్ఫుల్ గా ఉంటుందనే విషయం అర్థమైంది. సిద్ధు అనే ఐఏఎస్ అధికారి పాత్రను నేను పోషించాను. ఇలాంటి ఒక పాత్రను ఇంతవరకూ చేయలేదు. కమర్షియల్ మీటర్లో వెళ్లే సినిమా కావడంతో కథ వినగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను. 'లుక్ పరంగా పెద్దమనిషి లుక్ రావడానికి ఎన్ని తిప్పలు పడ్డవ్?' అని బిత్తిరి సత్తి అడగ్గానే నితిన్ స్పందిస్తూ . 'మీసాలు పెంచాను.. దాంతో పెద్దగైపాయే' అన్నాడు. 'అందుకు ఎంత టైమ్ పట్టింది .. మూడు .. నాలుగు నెలలు పట్టిందా?' అని బిత్తిరి సత్తి అడగ్గా ఒక నెల మాత్రమే తీసుకున్నా అంటూ నితిన్ సమాధానమిచ్చాడు. 'ఒక్క నెలలలోనే పెద్ద మనిషి లెక్క అయిపోయినవన్న మాట' అని బిత్తిరిసత్తి తనదైన ధోరణిలో అనగానే నితిన్ నవ్వేశాడు. మహతి స్వరసాగర్ ఈ సినిమాకి సంగీతాన్ని సమకూర్చాడు. ఇప్పటికే వదిలిన సాంగ్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా అంజలి ఐటమ్ సాంగ్ జనంలోకి దూసుకుపోయింది. నితిన్ సరసన కథానాయికలు గా కృతి శెట్టి - కేథరిన్ అలరించనుండగా రాజేంద్రప్రసాద్ .. సముద్రఖని .. వెన్నెల కిశోర్ .. మురళీశర్మ ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. తన సినిమాల ద్వారా టాలీవుడ్‌కి పరిచయమైన కొరియోగ్రఫర్స్ అందరికీ కూడా నితిన్ ఈ సినిమాలో ఛాన్స్ ఇవ్వడం విశేషం.



## రాఖీ శుభాకాంక్షలు తెలిపిన చిరంజీవి

**అక్కచెల్లెళ్లలకు అన్నదమ్ములు అండగా నిలవాలని ఆకాంక్ష**

నేడు దేశ వ్యాప్తంగా రాఖీ పండుగను అంతా ఎంతో ఘనంగా జరుపుకుంటున్న వేళ.. మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల కాలంలో చిరంజీవి ఎలాంటి సందర్భం వచ్చినా తన ట్విట్టర్ ఖాతా ద్వారా స్పందిస్తూ విషెస్ తెలపడం, శుభాకాంక్షలు చెప్పడం..కొత్తగా ఇండస్ట్రీకి వచ్చి సక్సెస్ అందుకున్న వారికి, తమ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద హిట్ అందుకున్న వారికీ అభినందనలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే ఈరోజు, అన్నా-చె÷-లలెళ్ళు, అక్కా తమ్ముళ్ళు కలిసి రాఖీ పండుగను ఎంతో ఆనందంగా జరుపుకుంటున్నారు.ఈ ఏడాది వచ్చిన తిథి, నక్షత్రం ప్రకారం ఈరోజు, రేపు.. రెండు రోజులు ఈ పండుగను జరుపుకుంటున్నారు. అయితే, ఈ సందర్భంగా చిరంజీవి తన ట్విట్టర్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ఇందులో ఆయన 'రాఖీ కట్టించుకోవటమే కాదు. రక్షగా నిలుస్తామని ఈ రోజు అన్నదమ్ములు, అక్క చెల్లెళ్లకి మాటివ్వాలి. నా సోదరసోదరీమణులందరికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు'..అని తెలిపారు. మెగా ఫ్యామిలీలోనూ ఈ పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఇక ఆయన నటిస్తున్న భోళా శంకర్ సినిమా కూడా సిస్టర్ సెంటిమెంట్‌తోనే తెరకెక్కుతోంది.గత ఏడాది రాఖీ పండుగకే ఈ మూవీ నుంచి చిరంజీవి..ఆయనకి సోదరిగా నటిస్తున్న కీర్తి సురేష్ల పోస్టర్‌ను వదిలారు. ఇందులో కీర్తి..చిరుకు రాఖీ కడుతున్నట్టుగా ఉంది. అంటే, భోళా శంకర్ సినిమాలోనూ అలాంటి సందర్భం, సన్నివేశాలు ఉంటాయని అర్థమవుతోంది. కాగా, మెగాస్టార్ ప్రస్తుతం గాడ్ ఫాదర్ మెగా 154 చిత్రాలలోనూ నటిస్తున్నారు. దసరా బరిలో గాడ్ ఫాదర్ దిగబోతుండగా, 2023, సంక్రాంతికి మెగా 154 రిలీజ్ కాబోతుంది. ఇక భోళా శంకర్ విడుదలపై క్లారిటీ రావాల్సి ఉంది.











## రాఖీ వేడుకల్లో సినిమా స్టార్లు

## విభిన్నరూపాల్లో రక్షాబంధన్ వేడుకలు

ప్రేమకు, ఆప్యాయతకు ప్రతీకగా జరుపుకునే పండుగ రక్షా బంధన్. ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఈ వేడుకను బాలీవుడ్ సెలబ్రెటీలు సైతం ఘనంగా జరుపుకుంటారు. అందరిలాగే తమ సోదరులకు రాఖీ కట్టి... ప్రేమాభిమానాలను పంచుకుంటారు. నటుడు సల్మాన్ ఖాన్ కూడా రాఖీ పండగను తన ఫ్యామిలీతో కలిసి చాలా బాగా సెలబ్రేట్ చేసుకుంటారు. ఈ సందర్భంగా సోహైల్, అర్బాజ్, ఆయుష్ లతో పాటు తన మేనల్లుళ్లతో కలిసి రాఖీలు కట్టుకొని ఉన్న చేతులను చూపిస్తూ ఫోజులిచ్చిన ఫొటో... వారి ప్రేమాభిమానాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఇక సల్మాన్ గురించి చెప్పాలంటే ఆయనకు ఇద్దరు సోదరీమణులున్నారు. వారే- అల్విరా, అర్పిత. అందరి లాగే వీరిద్దరూ కూడాప్రతి సంవత్సరం సల్మాన్‌కి రాఖీ కట్టి, దానికి ప్రతిగా 'భాయిజాన్'ని బుజ్జగించడం ఎప్పుడూ జరిగేదే. దిద్ధిమా కపూర్ పెళ్లి చేసుకుని చాలా కాలం తర్వాత ఢిల్లీకి వచ్చింది. మొన్నటి వరకు ఆమె వెలుగులోకి రాలేదు. గత సంవత్సరంలో రిద్ధిమా పబ్లిక్ ఫోరమ్‌లలో, టీవీ షోలలో రణబీర్‌తో తన బంధం గురించి చెప్పిన విషయం తెలిసిందే. తామిద్దరం మంచి తోబుట్టువులుగా ఎంత సన్నిహితంగా ఉంటారో ఆమె తెలిపింది. అయితే నేడు రక్షా బంధన్ సందర్భంగా దాదాపు రెండు సంవత్సరాల క్రితం ఆమె తల్లి నీతూ కపూర్ పోస్ట్ చేసిన ఈ సుందరమైన చిత్రాన్ని మళ్లీ ఒకసారి గుర్తు చేసుకుందాం. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా గురించి ఎంత చెప్పినా తక్కువే. నిక్ జోనాస్‌తో వివాహం అనంతరం ఆమె మరింత బిజీగా మారిపోయింది. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో విహరిస్తూ లైఫ్ ను ఎంజాయ్ చేస్తోంది. దీంతో ఆమె తన సోదరుడు సిద్దార్థ్ తో కలిసి గడిపే సమయం తగ్గిపోయినట్టు తెలుస్తోంది. దాదాపు 5 సంవత్సరాల తర్వాత రక్షా బంధన్ సందర్భంగా తన సోదరుడితో కలిసి ఉండే అవకాశం లభించిందని ప్రియాంక గతేడాది సోషల్ మీడియా ద్వారా చెప్పుకొచ్చింది. ఇక ప్రియాంక సోదరుడు హోటల్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్, ప్రొఫెషనల్ చెఫ్. అతనికి పూణెలో రెస్టారెంట్లు కూడా ఇన్నాయి. అంతే కాదు తన చెల్లితో, తల్లితో కలిసి కొన్ని సినిమాల్లోనూ కనిపించాడు. కార్తీక్ ఆర్యన్ తన సోదరి క్రితికతో చాలా సన్నిహితంగా ఉంటాడన్న విషయం అందరికీ తెలిసిందే. సోషల్ మీడియాలో ఆమెతో సరదాగా వీడియోలు చేస్తూ తరచుగా కనిపిస్తాడు. అయితే ప్రతీ సంవత్సరం కార్తీక్ తన సోదరితో ఉన్న చిత్రాన్ని రక్షా బంధన్ గుర్తుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాడు. అంతే కాదు దానికి ఫన్నీ క్యాప్షన్ ను కూడా ఇస్తాడు! 2020లో, ఆమె మెడికల్ స్కూల్ పూర్తి చేసింది. అదే సంవత్సరంలో రాఖీ సందర్భంగా, కార్తీక్ ఆమెతో ఉన్న ఓ అందమైన చిత్రాన్ని పోస్ట్ చేసి, 'ఒక డాక్టర్ గా ఆమెకు ఆమెను రక్షించుకోవాల్సిన బాధ్యత కూడా ఆమెపై ఉంది అంటూ క్రితిని ట్యాగ్ చేశాడు కార్తీక్.




## షూటింగ్ లో శిల్పాశెట్టి కాలుకి గాయం

నటీనటులు సినిమా షూటింగుల్లో ఉన్నప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఒక్కోసారి ప్రమాదాలు జరగడం చూస్తూనే ఉంటాం. అదే తరహాలో బాలీవుడ్ నటి శిల్పా శెట్టి కాలికి గాయమైంది. దీంతో ఆమెను హాస్పిటల్ కు తరలించారు. అయితే ఈ గాయానికి కారణం అని ప్రశ్నిస్తే... దానిక్కారణం డైరెక్టరేనంటూ

అందరికీ షాకిచ్చింది. ఇక వివరాల్లోకి వెళితే.. శిల్పాశెట్టి ప్రస్తుతం'సుఖీ' సినిమాతో పాటు 'ఇండియన్ పోలీస్ ఫోర్స్' వెబ్ సిరీస్ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆమె తన మొదటి వెబ్ సిరీస్‌లో యాక్షన్ పార్ట్ కూడా చేయబోతున్నట్టు సమాచారం. అయితే ఈ క్రమంలోనే ఆమెకు ఓ యాక్షన్ సీన్ షూట్ చేస్తుండగా కాలికి గాయమైంది. ఈ విషయాన్ని స్వయానే ఆమే సోషల్ మీడియా ద్వారా తెలిపింది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in